ARK MEDIA
SUBSCRIBE

TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం
ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి
జాతీయ తెలుగు దినపత్రిక
www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 276 | బుధవారం, అక్టోబర్ 28, 2026 | పేజీలు : 04 | వెల రూ. 2.00/

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754

# అర్ణబ్ తుపాను ప్రభావం: పలు రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

**అర్ణబ్ తుపాను కారణంగా రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం**
**ప్రయాణికుల భద్రత దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే**
**అక్టోబర్ 27, 28 తేదీల్లో కొన్ని రైళ్లు పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా రద్దు**
**సికింద్రాబాద్, హైదరాబాద్ నుంచి వెళ్లే పలు కీలక సర్వీసులు నిలిపివేత**
**ప్రయాణానికి ముందు రైలు స్టేటస్ చూసుకోవాలని ప్రయాణికులకు సూచన**

**హైదరాబాద్, నేటి ప్రభాత దర్శని**

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ప్రభావంతో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. తుపాను కారణంగా ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. (అక్టోబర్ 27, 28) పలు రైలు సర్వీసులను పూర్తిగా రద్దు చేయగా, ఓ రైలును పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించింది. ఈ మేరకు రద్దయిన రైళ్ల జాబితాను కూడా విడుదల చేసింది. తుపాను తీరం వైపు సమీపిస్తున్న కొద్దీ బలమైన గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రైల్వే ట్రాక్‌లపై నీరు నిలిచిపోవడం, సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక సమస్యలు తలెత్తడం వంటి ప్రమాదాలను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు వివరించారు. ముఖ్యంగా సికింద్రాబాద్, హైదరాబాద్, లింగంపల్లి వంటి ప్రధాన స్టేషన్ల నుంచి కోస్తాంధ్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు వెళ్లే సర్వీసులపై ఈ ప్రభావం పడింది. ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ప్రారంభించే ముందు తప్పనిసరిగా రైలు నడిచేది లేనిది నిర్ధారించుకోవాలని, రైల్వే అధికారిక వెబ్‌సైట్ లేదా మీజూా యాప్ ద్వారా తమ రైలు స్టేటస్‌ను తెలుసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

**పూర్తిగా రద్దయిన రైళ్ల జాబితా:**

కింద పేర్కొన్న రైళ్లను అక్టోబర్ 27, 28 తేదీల్లో పూర్తిగా రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది.

12704 - సికింద్రాబాద్ నుంచి హౌరా (అక్టోబర్ 27)

17016 - సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ (అక్టోబర్ 27)

12728 - హైదరాబాద్ నుంచి విశాఖపట్నం (అక్టోబర్ 27)

12862 - మహబూబ్‌నగర్ నుంచి విశాఖపట్నం (అక్టోబర్ 27)

12740 - లింగంపల్లి నుంచి విశాఖపట్నం (అక్టోబర్ 27)

17256 - లింగంపల్లి నుంచి నర్సాపూర్ (అక్టోబర్ 27)

12776 - సికింద్రాబాద్ నుంచి కాకినాడ టౌన్ (అక్టోబర్ 27)

12738 - లింగంపల్లి నుంచి కాకినాడ పోర్ట్ (అక్టోబర్ 27)

20810 - హెచ్.ఎస్. నాందేడ్ నుంచి సంబల్‌పూర్ (అక్టోబర్ 27)

07037 - చర్లపల్లి నుంచి శ్రీకాకుళం రోడ్ (అక్టోబర్ 27)

07038 - శ్రీకాకుళం రోడ్ నుంచి చర్లపల్లి (అక్టోబర్ 28)

**పాక్షికంగా రద్దయిన రైలు:**

ట్రైన్ నంబర్ 12788: నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్లాల్సిన ఈ రైలు అక్టోబర్ 27న చర్లపల్లి - నర్సాపూర్ మధ్య పాక్షికంగా రద్దు చేయబడింది. అంటే ఈ రైలు నాగర్‌సోల్ నుంచి చర్లపల్లి వరకు మాత్రమే నడుస్తుంది. తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, వాతావరణం అనుకూలించిన వెంటనే రైళ్ల రాకపోకలను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. ప్రయాణికులు తాజా సమాచారం కోసం రైల్వే శాఖ ప్రకటనలను గమనించాలని సూచించారు.



# కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు: మహేశ్ గౌడ్

**వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని మహేశ్ గౌడ్ ధీమా**
**తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని వ్యాఖ్య**
**ఆలోచన లేకుండా అప్పులు చేసి కేసీఆర్ రాష్ట్రాన్ని ముంచారని ఆరోపణ**

**హైదరాబాద్, నేటి ప్రభాత దర్శని**

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇంకా భ్రమల్లోనే జీవిస్తున్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను వారు గ్రహించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని... క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఉన్న 8 ఎంపీ సీట్లలో రెండు కూడా గెలవడం కష్టమేనని.. మరోవైపు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలవరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 40 శాతం సీట్లు తమకే వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుపై మార్కెట్ ఫీజు వ్యాపారులే చెల్లించాలి

**రైతుల నుంచి మార్కెట్ ఫీజు వసూలు చేయరు**
**లైసెన్సులు పొందకుండా వ్యాపారం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు**
**జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య**

**నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. కామారెడ్డి.**

కామారెడ్డి జిల్లాలోని పది వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను బహిరంగ మార్కెట్లో ఎక్కడైనా విక్రయించుకోవచ్చని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు తగ్గడంతో తెలంగాణలో పండిన వ్యవసాయ ఉత్పత్తులకు ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కనీస మద్దతు ధరల కంటే కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో అధిక ధరలు లభిస్తున్న నేపథ్యంలో వివిధ రాష్ట్రాల వ్యాపారులు కామారెడ్డి జిల్లాకు వచ్చి రైతుల నుంచి నేరుగా లేదా మధ్యవర్తుల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని కామారెడ్డి, భిక్కనూరు, గాంధారి, సదాశివనగర్, ఎల్లారెడ్డి, పిట్లం, బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో జరిగే కొనుగోళ్లకు సంబంధించి నిబంధనల ప్రకారం మార్కెట్ ఫీజు చెల్లించాల్సిన బాధ్యత కొనుగోలు చేసే వ్యాపారులదేనని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల విలువపై ఒక శాతం మార్కెట్ ఫీజును సంబంధిత వ్యాపారులు మార్కెట్ కమిటీలకు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

**రైతుల నుంచి మార్కెట్ ఫీజు వసూలు చేయరు**

మార్కెట్ ఫీజు చెల్లింపు విషయంలో కొందరు మధ్యవర్తులు, దళారులు రైతులకు తప్పుడు సమాచారం అందిస్తూ అపోహలు సృష్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. కనీస మద్దతు ధర ఆధారంగానే మార్కెట్ ఫీజు చెల్లిస్తామంటూ తనిఖీ కేంద్రాలు, తనిఖీ పాయింట్ల వద్ద మార్కెటింగ్ శాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగడం సరికాదన్నారు. రైతులు ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే, మార్కెట్ ఫీజును రైతుల నుంచి వసూలు చేయరని, నిబంధనల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారులే చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయంపై రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు.

**లైసెన్సులు తప్పనిసరిగా పొందాలి**

మార్కెట్ కమిటీల నుంచి అవసరమైన లైసెన్సులు పొందకుండా వ్యాపారం నిర్వహిస్తున్న మధ్యవర్తులు, దళారులు తప్పనిసరిగా మార్కెటింగ్ శాఖ లేదా సంబంధిత మార్కెట్ కమిటీల ద్వారా లైసెన్సులు పొంది నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం నిర్వహించాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య సూచించారు. నిబంధనలు పాటించకుండా, అవసరమైన లైసెన్సులు లేకుండా వ్యాపారం కొనసాగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు దళారులు, మధ్యవర్తులు చెప్పే అవాస్తవ సమాచారాన్ని నమ్మకుండా, మార్కెట్ ఫీజు చెల్లింపు విషయంలో వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు. వ్యవసాయ మార్కెట్లలో పారదర్శకమైన వ్యాపార లావాదేవీలు జరిగేలా మార్కెటింగ్ శాఖకు సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.



# బాన్సువాడ అభివృద్ధికి పోచారం తపన అభినందనీయం.. : మంత్రి సీతక్క

**10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు మంత్రి సీతక్క.**
**కొయ్య గుట్టలో మహిళా సంఘం ప్రారంభం.**



**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

బాన్సువాడ మండలం కొయ్య గుట్టలో పది లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన మహిళా సంఘ భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) మంగళవారం సాయంత్రం ప్రారంభించారు.అంతకముందు గ్రామానికి చేరుకున్న మంత్రికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గ్రామంలో మహిళా సమైక్య భవనం గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు మంత్రి సీతక్క భూమి పూజ శంకుస్థాపన చేయడంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించారు.అనంతరం బొర్లం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభత్సవలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడారు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన తపన అందరికీ స్ఫూర్తిదాయకమైన కొనియాడారు రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల వ్యయంతో దాదాపు రాష్ట్రంలో 8వేల భవనాలను నిర్మిస్తున్నామని కొయ్యగుట్టలో నిర్మించిన భవనం చూడడానికి ఫంక్షన్ హాలుగా ఎంతో అద్భుతంగా ఉందని అన్నారు. మహిళలందరూ సహాయక సంఘాల్లో చేరి ఆర్థికంగా పారిపుష్టిని సాధించాలని పిలుపునిచ్చారు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి మోసపోవద్దని ఇందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంఘ సభ్యులకు 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తుందని తెలిపారు మహిళలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గము అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు ఇంకా అనేక పనులు చేయాల్సి ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘం మాజీ ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు డిసిసిబి మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కాసుల విజయ వైస్ చైర్మన్ రేష్మ బేగం పిట్ల శ్రీధర్ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆరు నెలలైనా అందుబాటులోకి రాని పబ్లిక్ టాయిలెట్లు!

**సిరిసిల్ల పట్టణ పాత బస్టాండ్‌లో మహిళల అవస్థలు.**
**అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ నాయకురాలు బరకం వెంకటలక్ష్మిఊ ఆగ్రహం.**



**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి) ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 27 :**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో పబ్లిక్ టాయిలెట్ల సమస్య ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. పాత టాయిలెట్లను తొలగించి ఆరు నెలలు గడుస్తున్నా, కొత్త టాయిలెట్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బరకం వెంకటలక్ష్మి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే పాత బస్టాండ్‌లో కనీస మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం విచారకరమని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన కనీస వసతులు కల్పించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు.

**తాత్కాలిక టాయిలెట్లతోనూ తప్పని తిప్పలు.**

ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లలో సైతం నీటి సదుపాయం లేకపోవడం, అపరిశుభ్రత, దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారని వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మహిళలకు అత్యవసరమైన మరుగుదొడ్ల సదుపాయం కల్పించడంలో ఇంత జాప్యం ఎందుకు జరుగుతోందని నిలదీశారు. ఆరు నెలలుగా సమస్య కొనసాగుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా రవాణా కేంద్రంలో మహిళలకు గౌరవప్రదమైన, పరిశుభ్రమైన సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.

**ఇప్పటికైనా స్పందించాలి.**



సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాత బస్టాండ్‌లో నూతన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, అప్పటివరకు మొబైల్ టాయిలెట్లలో నీటి సదుపాయం కల్పించి పరిశుభ్రతను పర్యవేక్షించాలని బరకం వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. మహిళలు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

# కోనాపూర్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం

**యాసంగి ఆరుతడి పంటలపై అవగాహన**





**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి**

బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామంలోని రైతు వేదికలో రైతు నేస్తం ప్రోగ్రామ్ ద్వారా వ్యవసాయ విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో సాగుభూమి సంరక్షణ - ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, యాసంగిలో రైతులు ఆరుతడి పంటలైన శనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, మినుములు వంటి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం శనగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు కావలసిన రైతులు తమ పొలం పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ లతో రైతు వేదికకు రావాలని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం చేయడం ద్వారా భూసారం పెరుగుతుందని, రసాయన ఎరువులను సరైన మోతాదులో వాడాలని, ప్రతి రైతు తమ పొలంలో పంట కుంటలు నిర్మించుకోవడం ద్వారా నీటిని సంరక్షించుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో బోర్లం సొసైటీ చైర్మన్ సంగ్రాం నాయక్, కోనాపూర్ మాజీ ఉప సర్పంచ్ దిల్ రాజు, మాజీ ఎంపీటీసీ హనుమాన్లు పటేల్, సొసైటీ సీఈవో సురేందర్, గాండ్ల సాయిలు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కంచన్ బాగ్ లో దారుణం - మయన్మార్ మహిళపై అత్యాచారం - భర్తతో సహా నలుగురిపై కేసు

**నేటి ప్రభాత దర్శిని! హైదరాబాద్, చంద్రాయన గుట్ట**



పాతబస్తీ కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. మయన్మార్ కు చెందిన మహిళను బంగ్లాదేశ్ ఫయజ్ కు చెందిన వ్యక్తి వివాహం చేసుకుని అక్రమంగా నగరానికి వచ్చి కాంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్నాడు. మద్యానికి బానిసైన భర్త తన స్నేహితులతో బలవంతంగా లైంగిక చర్యలకు పాల్పడేలా ఒత్తిడి చేయసాగాడు. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు కంచన్ బాగ్ పోలీసులు కేసు నమోదు చేశారు. భర్తతో సహా మరో ముగ్గురిపై బాధితురాలు ఫిర్యాదు చేసింది. నిందితులందరూ బంగ్లాదేశ్ కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కంచన్ బాగ్ పోలీసులు తెలిపారు.

# మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన సదస్సు

**పెద్దపల్లి, అక్టోబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు షీ టీమ్ ఇన్‌ఛార్జి ఎస్ఐ ఎం. లావణ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రంగంపల్లిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ పోక్సో చట్టం, సోషల్ మీడియా ప్రభావం, టీనేజ్ మార్పులు, తల్లిదండ్రుల బాధ్యతలు, మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై వివరించారు. వేధింపులకు గురైతే 6303923700కు, అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112కు, ఆన్‌లైన్ మోసాలపై 1930కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రయాణ భద్రత కోసం టీ-సేఫ్ యాప్‌ను వినియోగించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సీహెచ్. వెంకటేష్, మల్లయ్య, షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ పాల్గొన్నారు.




# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలి

**వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి.**

**ఎఫ్‌పీఓలు, సీహెచ్‌సీల ద్వారా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.**



**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 27 :**

వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వినియోగాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన కేత్ బచావో అభియాన్, రైతు నేస్తం. కార్యక్రమాలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు), కస్టమ్ హైరింగ్ కేంద్రాలు (సీహెచ్‌సీలు), స్వయం సహాయక సంఘాల మహిళలకు వ్యవసాయ యాంత్రీకరణ, ప్రభుత్వ పథకాలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు.

### వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రిజర్వాయర్లలోని నీటిని తాగునీటి అవసరాలు, పశువుల అవసరాలకు అందుబాటులో ఉంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఒక ఎకరంలో వరి సాగుకు సుమారు 35 నుంచి 40 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని, దీనివల్ల విద్యుత్ వినియోగం కూడా అధికంగా ఉంటుందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టం 2.27 మీటర్ల మేర తగ్గిందని పేర్కొంటూ, నీటి వనరుల పరిరక్షణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వాతావరణ మార్పులు, నీటి కొరతను దృష్టిలో పెట్టుకొని ఈ యాసంగి సీజన్‌లో నువ్వులు, పొద్దుతిరుగుడు, వేరుశనగ, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.

### ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ప్రయోజనం.

బోయినపల్లి మండల రైతులు గత సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగులో ముందుండటం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన సమావేశంలో రైతులు ఆసక్తి చూపించారని, ఖమ్మం జిల్లాలో ఆయిల్‌పామ్ తోటలు, పరిశ్రమను సందర్శించేందుకు కూడా వెళ్లారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల టన్నుకు రూ.23,641 ధర ఉన్నట్లు తెలిపారు. జిల్లాకు సమీపంలోని సిద్దిపేట జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఉండటంతో పాటు, మండలంలోనే ఉత్పత్తుల సేకరణ కేంద్రం అందుబాటులో ఉందని వివరించారు. రైతులు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ పద్ధతులను వినియోగించి నీటిని పొదుపు చేయాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ఎఫ్‌పీఓలు, సీహెచ్‌సీల ద్వారా అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలి.

రైతులు, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. వీబీ-జీ రామ్‌జీ పథకం కింద జల సంరక్షణ పనులను ముమ్మరం చేయాలని, తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, బోరుబావుల రీఛార్జ్ గుంతలు, మ్యాజిక్ సోక్‌పిట్‌ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంచుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి పాల్గొని వ్యవసాయ యాంత్రీకరణ, ప్రత్యామ్నాయ పంటలు, సూపర్ ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై వివరించారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో రాష్ట్రంలో పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగు పెరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫోద్దీన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్, సర్పంచ్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకండి

**కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని అమ్మిరైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందాలి**

**ఐకేపీ వద్ద కొనుగోలు కేంద్రాలను స్థానిక సర్పంచులతో కలిసి ప్రారంభించిన ఏఎంసి చైర్మెన్ మేడిపల్లి దేవానందం**



**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి) ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 27 :**

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని అమ్మిరైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానందం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాగట్లపల్లి పధిర హరిదాస్ నగర్ వెంకటాపూర్ పోతిరెడ్డిపల్లి అగ్రహారం గ్రామాలలో ఏఎం సి చైర్మన్ మేడిపల్లి దేవానందం స్థానిక సర్పంచులతో కలిసి ఐకేపీ వద్ల కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసి ఛైర్మెన్ మేడిపల్లి దేవానందం , స్థానిక సర్పంచి ఎనుగందుల నరసింహులు సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ గౌస్ బాయ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన మన రాష్ట్రంతో పాటు సుమారు 180 రాష్ట్రాలలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడబోతున్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నందున మన రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్ ని నో కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచనలు చేస్తున్నారని దాన్ని రైతులు అర్థం చేసుకొని ఎల్ ని నో కరువు వలన కరెంటు ఉండదు బావుల్లో బోరుల్లో చెరువుల్లో కుంటల్లో నీరు ఉండదు ఈ కరువును అధిగమించడం కోసం ఆలోచించి పంటలు సాగు చేసి నష్టపోకుండా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు, మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. రైసు మిల్లర్లు నేరుగా రైతుల నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని అక్కడ ప్రభుత్వం మద్దతు ధర కంటే లాభం అనిపిస్తే రైతులు విక్రయించుకోవచ్చు అన్నారు, రైతులు 17% మ్యాచరు వచ్చే విధంగా వరి ధాన్యాన్ని ఆరబెట్టి ప్రభుత్వ మద్దతు ధర ను పొంది సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు, ఈకార్యక్రమంలో ఏపీఎం వెంకటలక్ష్మి , పంచాయతీ కార్యదర్శి కృష్ణ యాదవ్, ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ నంది కిషన్, ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ మెంబర్ బిపేట రాజకుమార్ మాజీవైస్ ప్రెసిడెంట్ గుండాడి రామ్ రెడ్డి , ఉప సర్పంచ్ బందారపు బాలిరెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి బండారి బాలిరెడ్డి, లాలాబాయి , తులసి గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు భాగ్య వివో ఏ గుండం మంజుల సిసి దేవేందర్ , సుదర్శన్ , ఎరుపుల శ్రీనివాస్ , మైనార్టీ నాయకులు రఫిక్, కోనేటి పోచయ్య, రాజేందర్ రెడ్డి సర్పంచులు మామిళ్ల కిషన్ ఏ ఏం సి డైరెక్టర్లు వార్డు సభ్యులు మహిళా సంఘం ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

# అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది

**ప్రధానమంత్రి గా రాహుల్ గాంధీ సీఎంగా రేవంత్ రెడ్డి అధికారుల్లోకి వస్తారు**

**బిజెపి సీనియర్ నాయకత్వం యువకులతో ఆందోళన చేయించి కేసులో పాలు చేయాలని చూస్తుంది**

**ఏఎంసీ చైర్మన్ మేడిపల్లి దేవానందం సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య**



**(నేటి ప్రబాత దర్శిని ప్రతినిధి) ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 27 :**

అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది. ప్రధానమంత్రి గా రాహుల్ గాంధీ సీఎంగా రేవంత్ రెడ్డి మళ్ళీ అధికారుల్లోకి వస్తారని ఏఎంసీ చైర్మన్ మేడిపల్లి దేవానందం సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్స్ గౌస్ బాయ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్ లో మంగళవారం ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే చిత్రపటానికి ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లికార్జున్ కార్గే గారి దిష్టిబొమ్మను బిజెపి నాయకులు దగ్ధం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ఓటర్లను తగ్గించడం కోసం కుటిల ప్రయత్నాలు చేస్తుందని దాన్ని ప్రశ్నించినందుకు బిజెపి నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని దళిత బిడ్డ దళిత నాయకుడు కార్గే గారి దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి బిజెపి నాయకులకు బుద్ధుందా అని వారు ప్రశ్నించారు, ప్రధాని మోడీని ఏమైనా తిట్టిండా,,,, దూషించిండా,,,, కాంగ్రెస్ పార్టీ ముక్త్ భారత్ ను చేస్తామని మోడీ ప్రకటించడాన్ని ఆయన తప్పుపడుతూ మీతో కాదు మీ అయ్యతో కాదు అని అన్నందుకు కార్గే దిష్టిబొమ్మ దగ్ధం చేస్తారా అని ఆయన ప్రశ్నించారు, లక్షలాది ఓట్లను ఓటర్ లిస్ట్ ల నుంచి తొలగించినందుకు నిరసనగా నవంబర్ ఒకటో తేదీన ఢిల్లీ లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో రామ్ లీలా మైదానంలో చేసే ఆందోళన కార్యక్రమంలో మనమందరం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలంలో బిజెపి సీనియర్ నాయకులు బి జె వై ఎమ్ కు చెందిన యువకులతో ఆందోళనలు చేయించి కేసుల పాలు చేయాలని కుట్రలు పన్నుతుందని వారు విమర్శించారు, అట్ల చేస్తే ఇక చూస్తూ ఊరుకోబొమ్మని వారు హెచ్చరించారు. పాలాభిషేకం కార్యక్రమంలో ఏఎంసి వైస్ ప్రసిడెంట్ నంది కిషన్ మాజీ వైస్ ప్రసిడెంట్ రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి గుండాడి రాంరెడ్డి బండారి బాలిరెడ్డి, సురేందర్, బీ పేట రాజ్కుమార్ , లాలా బాయి, గుళ్ళపెళ్ళి లక్ష్మి రెడ్డి , కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు గ్రామ శాఖల అధ్యక్షులు ఏఎంసీ డైరెక్టర్లు వార్డు మెంబర్లు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో వరి సాగు చేయవద్దు
# ప్రస్తుత పంటను అన్ని విధాలా కాపాడాలి





**యాసంగిలో వరి సాగు చేయవద్దు...**
**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావులి**
**కరువు పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి**
**వచ్చే ఏడాది జూలై వరకు త్రాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు**
**నీటి సంరక్షణ పనులు విస్తృతంగా చేపట్టాలి**

**నేటి ప్రభాత దర్శిని ఖమ్మం, అక్టోబర్ -27:**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత వానాకాలం పంటను అన్ని విధాలా కాపాడాలని, రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులతో ఎల్‌నినో పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా నీటి పారుదల, మిషన్ భగీరథ, వ్యవసాయం, భూగర్భ జలాలు, మార్కెటింగ్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు తమ శాఖల ప్రస్తుత పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరువు పరిస్థితులు, మండలాల వారీగా భూగర్భ జలాలు తగ్గుతున్న తీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు. ఈ నెలాఖరు నాటికి, వచ్చే నెలలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉండబోతుందనే అంచనాలను ప్రజలకు వివరించాలని, అధికారులు ఎప్పటికప్పుడు మీడియా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రస్తుతం రైతులు ఎంతో కష్టపడి సాగు చేస్తున్న వానాకాలం పంటను కాపాడేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెండవ పంట సాగు చేస్తే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఈ విషయాన్ని రైతులకు స్పష్టంగా వివరించాలని సూచించారు.

**యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం:**

రాబోయే యాసంగి సీజన్‌లో సాగునీటి లభ్యత ఉండే అవకాశం లేదని మంత్రి తెలిపారు. రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండాలని, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, ఇతర తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బిందు సేద్యం ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. రెండవ పంటకు సంబంధించి స్థానిక పరిస్థితులను బట్టి తక్కువ నీటితో పండే పంటలకు తడులు అందించే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. ఎక్కడా పంట వ్యర్థాలను తగులబెట్టకుండా చూడాలని, పంట వ్యర్థాలు తగులబెట్టిన ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**త్రాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యం:**

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. కిన్నెరసాని నీటిని యాసంగి పంటలకు విడుదల చేయవద్దని, అవసరమైతే మిషన్ భగీరథ త్రాగునీటి అవసరాలకు వినియోగించాలని ఆదేశించారు. నాగార్జునసాగర్ పరిధిలోని రెగ్యులేటర్లు, షట్టర్లు, పంపిణీ వ్యవస్థలను మూసివేసి, పాలేరు వరకు ప్రధాన కాలువల్లో నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలో మూడు పంప్‌హౌస్‌లను వినియోగించి సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయాలని తెలిపారు. పాలేరు రిజర్వాయర్ మూడు జిల్లాల త్రాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా నీటి నిల్వలను సమర్థంగా నిర్వహించాలని అన్నారు. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ సమీపంలో ఇసుక బస్తాలతో అడ్డుకట్టను పెంచి సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ ఏడాది నీటి ఆవిరి నష్టాలు, ఇంకుడు నష్టాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సమయాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించాలని, పైపులైన్ల లో లీకేజీలను అరికట్టి నీరు వృథా కాకుండా చూడాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూలై వరకు త్రాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. త్రాగునీటిని వాహనాల శుభ్రత, తోటల పెంపకం వంటి అవసరాలకు వినియోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నీటి వినియోగాన్ని క్రమంగా తగ్గించుకునే అలవాటును ప్రజల్లో పెంపొందించాలని సూచించారు.

**పాత త్రాగునీటి పథకాల పునరుద్ధరణకు చర్యలు:**

మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడేలా గ్రామాల్లో పాత త్రాగునీటి సరఫరా పథకాలను పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట వ్యక్తిగత బోర్లు, ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో త్రాగునీటి పథకాల పునరుద్ధరణకు అవసరమైన నిధులు, ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు.

**నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలి:**

ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సంరక్షణకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వీబీ-జీ రామ్‌జీ పథకం నిధులతో ఇంకుడు గుంతలు, బోరు రీచార్జి గుంతలు, వ్యవసాయ కుంటలు వంటి నీటి సంరక్షణ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. వీబీ-జీ రామ్‌జీ పథకం క్రింద రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చాల్సి ఉన్న నేపథ్యంలో, అందుబాటులో ఉన్న సుమారు రూ.7,000 కోట్ల నిధులను సమర్థంగా వినియోగించు కోవాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడే పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.

**పశుగ్రాసం కొరత నివారణకు చర్యలు:**

గ్రామాల్లో పశుగ్రాసం ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో పచ్చిగడ్డి పెంపకాన్ని ప్రోత్సహించి పశు గ్రాసం కొరతను అధిగమించాలని తెలిపారు. పశు వులకు తగినంత నీరు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు పశుగ్రాసం పెంపకం, సరఫరా బాధ్యతలను అప్పగించే అంశాన్ని పరిశీలించి తగిన ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**పత్తి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలి:**

పత్తి, ధాన్యం కొనుగోళ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. మార్కెట్‌లో పంటలకు లభిస్తున్న ధరల ప్రయోజనం రైతులకు అందేలా చూడాలని, ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్, సిండికేట్లు ఏర్పడకుండా మార్కెటింగ్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రైతులు పండించిన పంటలకు సరైన ధర లభించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు.



**విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలి:**

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని మంత్రి సూచించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాలపై రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, మోటార్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఎండిపోయిన బోర్లను వినియోగించకుండా చూడాలని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో వీధి దీపాలను దశలవారీగా సౌర విద్యుత్‌తో నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. నీరు, విద్యుత్ వృథాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు.

**పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ:**

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలు, గురుకులాల్లోని పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో పరిశుభ్రత పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.1986లో సుమారు 600 గ్రామాలు వరదల కారణంగా ముంపునకు గురైన సమయంలో ప్రజలకు ఆహారం, త్రాగునీరు అందించి అధికారులు సమర్థంగా పనిచేశారని మంత్రి గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లోనూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలో 10 మండలాల్లో తీవ్ర కరువు, 7 మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నాయని వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే భూగర్భ జలమట్టాలు సుమారు 2 మీటర్లు తగ్గిపోయాయని పేర్కొన్నారు.కామేపల్లి, మధిర, ఏన్కూరు, సత్తుపల్లి, ఎర్రుపాలెం మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని, ఆయా ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా, లంకాసాగర్ జలాశయాలను నింపుకోవడంతో పాటు నాగార్జునసాగర్ ఆయకట్టుకు కొంతమేర సాగునీరు అందించగలిగామని వివరించారు.రాబోయే యాసంగి సీజన్‌కు సాగునీరు అందుబాటులో లేదని, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. మధిర, ఏన్కూరు తదితర నాలుగు మండలాల్లో పశు గ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక పంపామని, అవసరమైన పశుగ్రాసాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా కొంత ఉపశమనం లభించిందని వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జల మట్టాలు సుమారు 3.5 మీటర్లు తగ్గిపోయాయని పేర్కొన్నారు.వానాకాలం పంటల సాగులో భాగంగా సుమారు 40 వేల ఎకరాల్లో వరికి బదులుగా ఇతర పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. భూగర్భ జలాలు మరింత తగ్గకుండా సంబంధిత అధికారులను అప్రమత్తం చేశామని, కొత్తగా బోర్లు వేయకుండా అవసరమైన చర్యలు చేపట్టామని వివరించారు.రాబోయే ఆరు నెలల పాటు త్రాగునీటి సరఫరాకు అవసరమైన నీరు అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో ఏనుగు వర్గీయుల ముందస్తు అరెస్టులు




**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

బాన్సువాడ మండలం లో మంగళవారం మంత్రి సీతక్క పర్యటన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు శంకుస్థాపన నేపథ్యంలో ఏనుగు రవీందర్ రెడ్డి వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను పోలీసులు వివిధ గ్రామాలు మండల కేంద్రాలు నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు.బాన్స్వాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్గం రవీందర్ రెడ్డి వర్గం మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అరెస్టులు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

**మంత్రికి స్వాగతం పలకడానికి సిద్ధమైతే అరెస్టుల.**

దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకుని బాన్సువాడలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన తమను తమ పార్టీ మంత్రి వస్తే అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసం అని ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు మంత్రి సీతక్క అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు వస్తుండడంతో ఆమెకు స్వాగతం పలకడానికి సిద్ధమవుతుండగా పోలీసులు ఉదయాన్నే తమ ఇళ్లకు వచ్చి అదుపులోకి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తమ కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రిని ఎప్పుడూ అడ్డుకోలేదని అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగించే ఉద్దేశం తమకు లేదని నాయకుడు పేర్కొన్నారు. అయినప్పటికీ ముందస్తు చేయడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమ పట్ల ఇలాంటి చర్యలు తీసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

# సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించిన ఛత్రినాక పోలీసులు.



**నేటి ప్రభాత దర్శిని! హైదరాబాద్, చంద్రాయన గుట్ట!**

పాతబస్తీ చార్మినార్ జోన్ ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌలిపుర డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీ ప్రాంతంలో ఛత్రినాక ఇన్ స్పెక్టర్,ఎస్, కోటేశ్వరరావు. ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రినాక ఇన్ స్పెక్టర్, ఎస్, కోటేశ్వరరావు. ప్రజలతో ఓటిపి, పిన్, పాస్ వర్డ్, బ్యాంకింగ్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు అని సూచించారు. అలాగే తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని తెలిపారు. అలాగే సైబర్ మోసం జరిగిన వెంటనే (1930) కు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ , కృష్ణమూర్తి నాయుడు,ఎస్సై, హసీనా బేగం. తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నషా ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వ్యాస రచన,ర్యాలీ కార్యక్రమం

**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి**




తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సూచనల మేరకు రేపు రాష్ట్ర వ్యాప్తంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 09:30 గంటలకు కర్షక్ బి.ఎడ్ కళాశాలలో ఇంటర్,డిగ్రీ,డిగ్రీ,పీజీ విద్యార్థులకు బి.ఎడ్ మాదక రహిత భారతదేశం అనే అంశంపై వ్యాసరచన కళాశాలలో,10:00 గంటలకు నిజాంసాగర్ చౌరస్తాలో ర్యాలీ,11:00 గంటలకు రాష్ట్ర గవర్నర్ తో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ సంజీవరెడ్డి, స్టేట్ ఈసీ నెంబర్ జైపాల్ రెడ్డి,రెడ్ క్రాస్ సభ్యులు మరియు కళాశాలల విద్యార్థులు పాల్గొనడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాష్ట్ర సీఈఓ దివ్య దేవరాజన్





**కొమురం భీమ్ ఆసిఫాబాద్, నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి.అక్టోబర్ 27:**

జిల్లాలో గ్రామీణ అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం, సౌర విద్యుత్ వినియోగం, గ్రామీణ ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) దివ్య దేవరాజన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంగళవారం ఐటీడీఏ పిఓ మందమకరందు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్ తో కలిసి తిర్యాణి మండలంలోని సుంగాపూర్ గ్రామ పరిధిలోని కొలంగూడ గ్రామంలో సందర్శించారు , ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులు, స్థానికులతో చర్చించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని అని అన్నారు. గుడిపేట గ్రామంలో సౌర విద్యుత్ (సోలార్) ద్వారా వ్యవసాయ మోటార్ల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. సౌర విద్యుత్ వినియోగం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు సాధించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గుడిపేట గ్రామంలో చేపడుతున్న కోళ్ల పెంపకం కార్యక్రమాన్ని పరిశీలించి, గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చడంలో పౌల్ట్రీ పెంపకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు వివిధ స్వయం ఉపాధి కార్యక్రమాలను చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ జీవనోపాధి మార్గాలను మెరుగుపరచుకోవాలని తెలిపారు మండల సమాఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించి, మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, గ్రామీణ జీవనోపాధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. సంఘాల సభ్యులకు వివిధ జీవనోపాధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా, స్థిరమైన ఆదాయ మార్గాలు ఏర్పడేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బి దత్తారావు సంబంధిత శాఖల అధికారులు, మండల సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలతో యువకుడి కి దేహశుద్ధి

**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి ) ఎల్లారెడ్డి పేట ఆక్టోబర్ 27 :**

మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలతో ఓ యువకుడిని పట్టుకొని చితకబాదిన ఘటన ఎల్లారెడ్డిపేటలో జరిగింది.. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన యువకుడు మండలంలోని ఓ గ్రామంలో అమ్మాయిలను వేధిస్తున్న క్రమంలో కాలనీవాసులు అడ్డుకొని బెదిరించడంతో అక్కడి నుండి పారిపోయాడు. వెంటనే ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జూబేర్ ను బిజెపి నాయకులు పట్టుకొని చితకబాదారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రమేష్ గౌడ్ అక్కడికి చేరుకొని సదరు యువకుడిని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకుడిగా జుబేర్ చెలామణి బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకుడిగా జుబేర్ చెలామణి అవుతున్నాడనే మండలంలో ప్రచారం జరుగుతుంది. మాజీ మంత్రి సిరిసిల్ల ఎంఎల్యే కెటిఆర్ తో జుబేర్ దిగిన పోటోలను పోలీసులు జుబేర్ ను అదుపులోకి తీసుకున్న తరువాత వాట్సాప్ ఫేస్బుక్లలో వైరల్ అవుతున్నాయి.





## కళల ద్వారా సామాజిక రుగ్మతలను రూపుమాపవచ్చు

**జిల్లా విద్యాధికారి వై.తిరుపతిరావు**



**నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి**

ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని ఎస్.సి ఇ.ఆర్. టి. తెలంగాణ మరియు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోల్ ప్లే పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ రోల్ ప్లే పోటీలను ప్రారంభించిన జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎంతో సృజన దాగి ఉంటుందని ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులను గమనిస్తూ వారిలో దాగివున్న అంతర్గత సృజనను వెలికి తీయాల్సిన అవసరం ఉందని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థుల్లో బాల్యదశ నుండి వివిధ సామాజిక రుగ్మతల పట్ల స్పృహ కలిగి ఉండాలని కోరారు.. అంతేకాకుండా ఆరోగ్యము, మానసిక ఆరోగ్యము, విలువలు, లింగ సమానత, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, శారీరక, మానసిక రక్షణ.. సామాజిక మాధ్యమాలయందు జాగ్రత్తగా ఉండడం ఇలాంటి విషయాల మీద అవగాహన కలిగి ఉండాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఈ విషయాల పట్ల పిల్లల్లో అవగాహన కలిగించడానికి ఇలాంటి రోల్ ప్లేస్ ను ఏర్పాటు చేసిందని, వీటిని విద్యార్థుల్లో విరివిగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు ఇలాంటి సామాజిక రుగ్మతల యందు తగు జాగ్రత్తగా మసులుకోవాలని అలాగే విద్యార్థులను ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహిస్తూ సృజనని బయటకు తీయాలని సూచించారు. తదనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు కర్ర అశోక్ రెడ్డి, మిల్కురి శ్రీనివాస్, సైన్స్ అధికారి చాద జయపాల్ రెడ్డి, న్యాయనిర్ణేతలుగా ఖాజా మంజూర్ అలీ,గాజుల రవీందర్ పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం





**రూ.42.80 కోట్లతో 71.63 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం ప్రారంభం**

**కామారెడ్డి ప్రభాత దర్శిని ప్రతినిధి**

గిద్ద, కుప్రియాల్ గ్రామాల్లో నూతన విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు స్థల పరిశీలన ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మంగళవారం రామారెడ్డి మండల పరిధిలోని పోసానిపేట, రంగంపేట గ్రామాల సరిహద్దులో ఉన్న మోషంపూర్ చౌరస్తా వద్ద హైబ్రిడ్ యాన్యుటీ విధానం (హెచ్ఏఎం) మొదటి దశ కింద రూ.42.80 కోట్ల వ్యయంతో 71.63 కిలోమీటర్ల మేర చేపట్టనున్న పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

అనంతరం రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు, మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని వారు పేర్కొన్నారు.

**ఏడు విద్యుత్ ఉపకేంద్రాల మంజూరులో ఎమ్మెల్యే కృషి అభినందనీయం: మంత్రి సీతక్క**

అనంతరం రామారెడ్డి మండలం గిద్ద గ్రామం, సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామాల్లో నూతన విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలను మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ పరిశీలించారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఏడు విద్యుత్ ఉపకేంద్రాలు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ చూపిన ప్రత్యేక చొరవ, పట్టుదల అభినందనీయమని మంత్రి సీతక్క అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుపై సానుకూలంగా ఉన్నారని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, మహిళల ఆర్థిక అభివృద్ధి, సాధికారత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.

**గిద్ద గ్రామ ప్రజల చిరకాల స్వప్నం సాకారం**

గిద్ద గ్రామంలో రూ.2.88 కోట్ల వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయించి, విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

విద్యుత్ ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే గిద్ద గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు.

**కుప్రియాల్ గ్రామానికి రూ.2.63 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం**

సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామంలో రూ.2.63 కోట్ల వ్యయంతో నూతన విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే మదన్ మోహన్ వెల్లడించారు. గ్రామ ప్రజల చిరకాల డిమాండ్‌ను నెరవేర్చే దిశగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణం పూర్తయితే కుప్రియాల్‌తోపాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని, ముఖ్యంగా వ్యవసాయ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

కుప్రియాల్ గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

రహదారులు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొంటూ, నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి సీతక్కలకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**అభివృద్ధి పనులకు జిల్లా యంత్రాంగం సహకారం: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే మదన్ మోహన్ చేస్తున్న కృషిని అభినందించారు. అభివృద్ధి పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, , విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, మండల ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈ నెల 28న జిల్లాకు రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్ రాక

**రాష్ట్ర సమాచార కమిషన్ కార్యదర్శి ఆర్.స్వప్న**

**నేటి ప్రభాత దర్శిని అక్టోబర్ 27,**

ఈనెల 28వ తేదీన రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మోసిన పర్వీన్, దేశాల భూపాల్, బో రెడ్డి అయోధ్య రెడ్డి, వైష్ణవి మెర్ల జిల్లాకు రానున్నారని రాష్ట్ర సమాచార కమిషన్ కార్యదర్శి ఆర్.స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ ఉదయం 11.15 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లాలోని ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 1.15 గంటల నుండి సంబంధిత శాఖల ప్రజా సమాచార అధికారులతో కలిసి సమాచార హక్కు చట్టం కింద దాఖలైన అప్పీళ్లు, ఫిర్యాదులపై కేసుల పరిష్కారంపై విచారించడం జరుగుతుందని తెలిపారు.